విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ విద్యుత్ కార్మికులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక కౌన్సిలర్లతో కలిసి విద్యుత్ తీగల కింద ఉన్న ఇళ్లు, నూతనంగా అవసరమైన చోట్ల విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు మాదేవి, ఆంజనేయులుగౌడ్, రవీందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్, మున్సిపాలిటీ కార్మికులు పాల్గొన్నారు.

బ్లైండ్ కోడింగ్ ఈవెంట్‌తో విద్యార్థుల నైపుణ్యం గుర్తించవచ్చు



విజేతలను అభినందిస్తున్న మల్లికార్జున్‌రెడ్డి, విజయ్‌కుమార్

ఘట్‌కేసర్: బ్లైండ్ కోడింగ్ ఈవెంట్‌తో విద్యార్థుల కోడింగ్ నైపుణ్యం గుర్తించవచ్చని హెచ్‌ఓడీ మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విభాగం ఐఈఈఈ–సీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లైండ్ కోడింగ్ ఈవెంట్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈవెంట్‌లో 180 మంది విద్యార్థులు పోటీపడగా విజేతగా సీఎస్ఈ నుంచి శ్రేయరెడ్డి, ఏఐ నుంచి రన్నరప్‌గా నిలిచిన కీర్తనను డీన్ విజయ్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ తృప్తి, విద్యార్థి సమన్వయ కర్తలు ఐశ్వర్య, కార్తీక్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా బ్యాగుల పంపిణీ



కీసర: అంకిరెడ్డిపల్లిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సెల్స్‌ఫోర్స్ ఉద్యోగిని రవీనా షణ్ముగం, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచితంగా బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవీనా షణ్ముగం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత ఇచ్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యాంప్రసాద్, శేఖర్, శ్రీవాణీ, మౌనిక, ఉపాధ్యాయబృందం, తదితరులు పాల్గొన్నారు.

కార్న్ బర్స్టర్ పరికరం అందజేత



పరికరాన్ని అందజేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ సెట్ కళాశాల విద్యార్థుల బృందం తయారు చేసిన కార్న్ బర్స్టర్ పరికరాన్ని మండలంలోని మునీరాబాద్ గ్రామానికి చెందిన తారాబాయ్‌కి అందజేశారు. ప్రజల సమస్యలకు సాంకేతిక పరిష్కారం చూపేందుకు గాను కళాశాల అధ్యాపకులు సురేశ్‌రామ్, రవికిరణ్ పర్యవేక్షణలో విద్యార్థులు శ్రీరామ్, దీపిక, శశికుమార్, తేజశ్రీ, కృతిక బృందం సోలార్‌తో పనిచేసే మొక్కజొన్న పొత్తులు వేరుచేసే పరికరాన్ని తయారు చేశారు. గురువారం గ్రామ సర్పంచ్ గణేశ్, ఉపసర్పంచ్ నర్సింగ్‌రావుతో కలిసి విద్యార్థుల బృందం గ్రామానికి చెందిన వ్యాపారి తారాబాయ్‌కి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న పొత్తులు వేరుచేసే సమయంలో రైతులు ఇబ్బంది పడే శ్వాసకోశ వ్యాధులు, చేతినొప్పి సమస్యలు ఈ పరికరంతో తొలగిపోతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, దేవదాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఐటీలో యునైటెడ్ నేషన్స్ ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ జంగారెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ఐటీ కళాశాలలో మోడల్ యునైటెడ్ నేషన్స్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు సాగే నమూనా ఐక్యరాజ్య సమితి సదస్సు ప్రారంభ కార్యక్రమంలో సీఎంఆర్ గ్రూప్స్ సెక్రటరీ గోపాల్‌రెడ్డి, సీఎంఆర్ఐటీ డైరెక్టర్ జంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు జాతీయ స్థాయి అంశాలపై అవగాహన అవసరం అన్నారు. విద్యార్థుల్లో అంతర్జాతీయ వాదం పట్ల అవగాహన కల్పించడంలో ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సీఎంఆర్ గ్రూప్స్ సీఈఓ అభినవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మేడ్చల్‌రూరల్: చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మేడ్చల్ పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నవీన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పెద్ద చెరువులో నీటిపై మృతదేహం తేలియాడుతున్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. 35 ఏళ్ల వయస్సు గల మృతుడి వివరాలు తెలియకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి

కుత్బుల్లాపూర్: ఆస్తి పన్నుల వసూళ్లలో సర్కిల్ అధికారులు తలమునకలయ్యారు. గత నెల రోజులుగా అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా విధులు నిర్వహించిన అధికారులు ఇప్పుడు ఆస్తి పన్నుల వసూళ్లపై దృష్టి సారించారు. ముఖ్యంగా ఆస్తి పన్ను చెల్లించండి.. అభివృద్ధికి సహకరించండి.. అనే నినాదంతో ముందుకు సాగుతున్నారు. జంట సర్కిళ్లైన గాజులరామారం, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లోని 8 డివిజన్లలో ఇప్పటికే అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయా సెక్టార్ల వారీగా కేటాయించిన ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు పన్నులను సేకరించే పనిలో ఉపక్రమించారు. కాగా ఆన్‌లైన్, జీహెచ్ఎంసి యాప్‌ల ద్వారా సైతం పన్నులు చెల్లించే విధంగా ప్రజలకు వివరిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంతో కొంత మేరకు వెనుకబడినా ప్రస్తుతం సర్కిల్ అధికారులు పూర్తి స్థాయిలో పన్నుల వసూళ్ల విషయంలో దృష్టి కేంద్రీకరించారు. తాము ఎంచుకున్న టార్గెట్‌ను రీచ్ అయ్యే విధంగా ప్రణాళికలను రూపొందించుకుని ముందుకు సాగుతున్నారు. వంద శాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా పని చేస్తున్నారు. గాజులరామారం సర్కిల్ పరిధిలో రూ.34 కోట్లకు గాను రూ.18 కోట్లను వసూలు చేశారు. ఈ డిసెంబరు నెలలో రూ.4.44 కోట్లు టార్గెట్‌గా నిర్దేశించుకుని పని చేస్తున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో రూ.57.38 కోట్లకు గాను రూ 24.38 కోట్లను వసూలయ్యాయి. ఈ నెలలో రూ.6.60 కోట్ల వసూళ్లను లక్ష్యంగా పెట్టుకున్నారు.



కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల మున్సిపల్ కార్యాలయం

సకాలంలో పన్ను చెల్లించాలి



ఆస్తి పన్నులను సకాలంలో చెల్లించి అధికారులకు సహకరించాలి. ఇప్పటి వరకు గాజులరామారం సర్కిల్‌లో రూ.34 కోట్లకు గాను రూ.18 కోట్లు వసూలయ్యాయి. మిగిలిన రూ.16 కోట్లను వసూలు చేసే విధంగా అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు. డిసెంబర్ నెలలో విధించిన టార్గెట్‌ను ప్రతి ఒక్క సిబ్బంది చేధించే విధంగా అధికారులు కృషి చేస్తున్నారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన సిఎస్‌సి కేంద్రంలో గాని ఆన్‌లైన్ ద్వారా గాని చెల్లించవచ్చు..

– మల్లారెడ్డి, గాజులరామారం ఉప కమిషనర్

ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం



కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో మొత్తం రూ 57.38 కోట్లకు గాను రూ 33 కోట్లు వసూలయ్యాయి. ఎన్నికల నేపథ్యంలో నెల రోజులుగా వసూళ్లు తగ్గాయి. ఇప్పుడు తిరిగి వసూళ్లను వేగవంతం చేశాం. మిగిలిన రూ.24,38 కోట్లను వసూలు చేసేందుకు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశాం. ఈ నెలలో రూ.6.60 కోట్లను టార్గెట్‌గా పెట్టుకుని పని చేస్తున్నాం. వంద శాతం ఫలితాలు సాధించే విధంగా కృషి చేస్తున్నాం.

– నాగమణి, కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్

జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక

జవహర్‌నగర్: శామీర్‌పేట క్రీడా పాఠశాలలో జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఈ నెల 10వ తేదీన ఎంపిక నిర్వహిస్తున్నామని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల వారు 10వ తేదీన ఉదయం 7 గంటలకు క్రీడా పాఠశాలకు హాజరుకావాలని, మరిన్ని వివరాలకు ఫోన్: 98496 12733.

మల్టీపర్పస్ మండపం పనులకు శంకుస్థాపన



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్ ఒకటో వార్డు బీ1 పార్క్ స్థలంలో నిర్మిస్తున్న మల్టీపర్పస్ మండపం పనులకు స్థానిక కౌన్సిలర్ చందుపట్ల వెంకట్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానికులతో కలిసి భూమి పూజ చేశారు. మండపం నిర్మాణానికి మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ భద్రారెడ్డి రూ.2 లక్షల విరాళం అందజేశారు. కార్యక్రమంలో బీ1, బీ2 కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కాపాడాలని గ్రామస్తుల ధర్నా



అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతి

సాక్షి, మేడ్చల్ జిల్లా: 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని శుక్రవారం కలెక్టరేట్ ఎదుట అద్రాస్‌పల్లి పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులతో కలిసి గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి మండలం అద్రాస్‌పల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబరు–235లో ఉన్న 15 ఎకరాల ప్రభుత్వ భూమి మూడేళ్లుగా కబ్జాదారుల ఆధీనంలో ఉందని, ఆ భూమిని కాపాడాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులకు తెలిపినా.. పట్టించుకున్న దాఖలాలు లేవని వారు తీవ్రంగా దుయ్యబట్టారు. ప్రజావాణిలో కూడా పలుమార్లు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం ద్వారా కూడా ప్రజావాణిలో అభ్యర్థన లేఖలను పలుమార్లు అందజేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన 15 ఎకరాల ప్రభుత్వ భూమి ఇప్పటికీ కబ్జాదారుల ఆధీనంలోనే ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామస్తుల డిమాండ్ మేరకు గురువారం గ్రామపంచాయతీ పాలకవర్గం సమావేశంలో ఆక్రమదారుల నుంచి 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని తీర్మానించి, సంబంధిత జిల్లా అధికారులకు నివేదించినట్లు వారు తెలిపారు. ధర్నా అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆందోళనలో గ్రామ సర్పంచ్ బోయిని లలిత, వార్డు సభ్యులు కవిత, శ్రీను, నాగలక్ష్మి, నాగరాజు, రాజు, శ్రీను, లక్ష్మీ, మనెమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

నైతిక విలువలు అలవర్చుకోవాలి



సుపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలను అలవర్చుకోవాలని జిల్లా నోడల్ అధికారి మురళీకృష్ణ అన్నారు. గుండ్లపోచంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు, అధికారులు, ఉపాధ్యాయులుగా మారి పాత్ర పోషించారు. కార్యక్రమంలో పాల్గొన్న నోడల్ అధికారి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. భారతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తకాలు అందించారు. ఈ ఏడాదికి ఉత్తమ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు రంగాచారి మెడల్స్, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



కుషాయిగూడ: తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టు ఎదుట శుక్రవారం న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కర్ణాటక, గుల్బర్గలో జరిగిన న్యాయవాది దారుణహత్యను ఖండిస్తూ నిరసన చేపట్టినట్లు రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోట రాంచంద్రారెడ్డి తెలిపారు. న్యాయవాదులపై దాడులకు పాల్పడే వారి పట్ల ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలన్నారు. హత్యకు కారణమైన దోషులను శిక్షించి భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు.

శ్రీదుర్గా జ్యోతిష్యాలయంలో 11వ తేదీన పూజలు

గౌతంనగర్: మాస శివరాత్రి సందర్భంగా ఉత్తంనగర్ శ్రీదుర్గా జ్యోతిష్యాలయంలో 11వ తేదీ సోమవారం ఉదయం 6 గంటలకు విశేష ద్రవ్యాల చేత స్ఫటిక లింగానికి అభిషేకం, 7 గంటలకు రుద్రయాగంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మూగు నాగరాజుశర్మ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు ఎమ్మెల్యేగా బండారి లక్ష్మారెడ్డి ప్రమాణ స్వీకారం

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన బండారి లక్ష్మారెడ్డి శనివారం తెలంగాణ అసెంబ్లీలో ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొని ప్రమాణ స్వీకారం చేయనున్నారు. శనివారం నుంచి నాలుగు రోజుల పాటు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు జరుగనున్న సందర్భంగా ముందుగా ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం ఉంటుంది.

శెభాష్..

సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ కమిషనరేట్ పరిధిలో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించిన ఎలక్షన్ సెల్ సిబ్బందికి రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్ అభినందనలు తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులకు అనుగుణంగా సిబ్బంది పనిచేయడానికి అవసరమైన తోడ్పాటు అందించిన ఎలక్షన్ సెల్ సిబ్బందిని కమిషనర్ ప్రశంసించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన రోజు నుంచి కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకూ క్రమశిక్షణతో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించడం వల్లే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని కమిషనర్ పేర్కొన్నారు. అవసరమైన చోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేయడం ద్వారా అన్ని రకాల అక్రమ తరలింపులు అడ్డుకోవడం సాధ్యమైందని, రాష్ట్రస్థాయిలో గంజాయి, డ్రగ్స్ స్వాధీనంలో మొదటి స్థానం, మొత్తం రూ.68 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్ తదితర వాటిని స్వాధీనం ద్వారా రాష్ట్రంలోనే రెండవ స్థానంలో నిలిచి, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా కృషి చేశామని పేర్కొన్నారు. సమీప భవిష్యత్‌లో రాచకొండ పరిధిలో నిర్వహించే అన్ని ఎన్నికలను ఇంతే సమర్థవంతంగా నిర్వర్తిస్తామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ శ్రీనివాస్ కుమార్, ఎస్‌బీ ఓఎస్డీ మహేష్, ఐటీ సెల్ ఏసీపీ నరేందర్ గౌడ్, ఇన్‌స్పెక్టర్లు కొండల్ రావు, రవికుమార్‌తో పాటు ఇతర అధికారులు, సిబ్బందిని కమిషనర్ అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు.

కూరగాయల కత్తితో హత్య

జవహర్‌నగర్: ఇద్దరు వ్యక్తులు గొడవ పడగా ఒకరిని హత్య చేసిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రవి(15), బాబు(15), జితేందర్(38)లు ఫాల్‌సీలింగ్ పనులు చేసుకుంటూ దమ్మాయిగూడలో ఒకే గదిలో నివసిస్తున్నారు. జితేందర్ వీరిద్దరికీ సూపర్‌వైజర్. గురువారం రాత్రి వీరు ముగ్గురు పనులు ముగించుకొని మద్యం తాగి పడుకున్నారు. శుక్రవారం ఉదయం జితేందర్ పని నిమిత్తం బయటకు వెళ్లాడు. బాబు తన ఫోన్ ఇవ్వమని రవిని కోరడంతో తాను ఇవ్వలేదు. ఈ క్రమంలో వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో సహనం కోల్పోయిన బాబు క్షణికావేశంలో రవిని కూరగాయలు కోసే కత్తితో కడుపులో పొడవగా తీవ్ర రక్తస్రావమై రవి అక్కడికక్కడే మృతిచెందాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బండారికి అభినందనలు

కుషాయిగూడ: ఉప్పల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన బండారి లక్ష్మారెడ్డిని శుక్రవారం మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ మహిళ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగు పెడుతున్న బండారి లక్ష్మారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా నాయకులు కృష్ణవేణి, పర్వీన్, లక్ష్మీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి అభినందనలు

కుషాయిగూడ: రాష్ట్ర క్యాబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పోలగాని శ్రావణ్‌కుమార్‌గౌడ్, పోలేపాక అంజయ్య, బూడిద శ్రావణ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం హర్షణీయమన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

కాప్రా: సమాజంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని, తమ ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తిస్తున్న తీరు మరువలేనిదని కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి అన్నారు. శుక్రవారం కాప్రా డివిజన్ వార్డు కార్యాలయం వద్ద మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు శానిటేషన్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు సేవలు అందించకుంటే ప్రజల ఆరోగ్యం కుంటుపడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

అయ్యప్ప పూజలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రామంతాపూర్: డివిజన్ మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావు దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం నెహ్రూనగర్‌లోని ఐశ్వర్య హైట్స్‌లో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి హాజరై పూజల్లో పాల్గొన్నారు. కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌తో పాటు పలువురు స్వాములు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి అత్వెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు మల్కాజిగిరికి చెందిన మల్లిఖార్జున్ ఆల్ ఇన్ వన్ పుస్తకాలను అందజేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులతో కలిసి 70 మంది విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను అందజేశారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మల్లిఖార్జున్‌ను అభినందించి, ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం రామారావు, ఉపాధ్యాయులు గడప నవీన్, మంజుల, వసీం, పద్మలత, తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ పైపులైన్ పనులు పూర్తయ్యేదెన్నడు?



గురుమూర్తినగర్- గిరినగర్ రోడ్డులో వృథాగా మిగిలిపోయిన భూగర్భ డ్రైనేజీ పైపులు



పనుల కోసం గిరినగర్‌లో రోడ్డును ధ్వంసం చేసిన దృశ్యం

రంగారెడ్డినగర్: భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులకు బాలారిష్టాలు తప్పడం లేదు.. గత ఆరు నెలలుగా సదరు పనులు ఒకడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్న చందంగా మారాయి.. ఒకసారి వర్షాలు కురుస్తున్నాయని పనులను ఆపితే, మరోసారి ఎన్నికల కోడ్‌తో నిలిపోయాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గురుమూర్తినగర్– గిరినగర్ రోడ్డు నుండి గిరినగర్‌లోని పోచమ్మ ఆలయం వరకు దాదాపు 25 లక్షల నిధులతో భూగర్భ డ్రైనేజీ పనులకు ఆరు నెలల క్రితం శంకుస్థాపన చేశారు. అయితే పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ రెండు నెలల పాటు ఏ పనులు చేపట్టకుండా కాలం వెల్లదీశాడు. సెప్టెంబరు నెలలో తీరా పనులు చేపట్టేందుకు రోడ్డును కొంత మేర ధ్వంసం చేయగా వర్షాలు పడుతున్నాయని జలమండలి అధికారులు నిలుపుదల చేశారు. ఇలా జాప్యం కొనసాగుతూ రాగా ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో అప్పటి నుండి భూగర్భ డ్రైనేజీ పనులు ముందుకు సాగడం లేదు.

రోడ్డు ధ్వంసంతో రాకపోకలకు ఇబ్బందులు..

గిరినగర్‌లోని పోచమ్మ ఆలయం వరకు పనులు చేపట్టేందుకు కొంత మేర రోడ్డును ధ్వంసం చేశారు. సుమారు పర్లాంగ్ మేర రోడ్డు పెచ్చులూడి ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కరంగా మారింది. జలమండలి అధికారులను పనుల విషయమై స్థానికులు అడిగితే సమాధానం దాటవేస్తున్నారని, సదరు కాంట్రాక్టర్ తమ ఇళ్ల ముందు పైపులు ఉంచి కనిపించకుండా పోయాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిధులు విడుదలైన పనులకు ఇంత జాప్యం ఎందుకు చేస్తున్నారని, చిన్నపాటి వర్షాలకు పనులు ఆపి వేశారని, తీరా పనులను ప్రారంభించేలా లోపు ఎన్నికల కోడ్ నెపంతో రెండోసారి పనులు నిలిచిపోయాయని, ఇంకెన్ని రోజులు భూగర్భ డ్రైనేజీ పనులను సాగదీస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన పైపులైన్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.